
సాక్షి ఒడిశా

సోమవారం । 14 । జూలై । 2025





**శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు**
నగదు : రూ. 6,99,535
బంగారం : 11 గ్రాముల 800 మిల్లీ గ్రాములు
వెండి : 32 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



**బోల్‌భం భక్తులపైకి..**

బోల్ భం భక్తులపైకి ఫైర్ ఇంజిన్ దూసుకెళ్లింది. ఒకరు మృతి చెందారు. - 8లో



**22 కిలోల గంజాయి..**

కొరాపుట్ జిల్లాలో 22 కిలోల గంజాయి దొరికింది. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. - 8లో

## న్యూస్‌రీల్

### నవీన్ పట్నాయిక్‌ను పరామర్శించిన పర్లాకిమిడి ఎమ్మెల్యే



భువనేశ్వర్‌లో నవీన్ నివాసం వద్ద పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి తదితరులు

పర్లాకిమిడి: మాజీ ముఖ్యమంత్రి, బీజేడీ రాష్ట్ర నేత నవీన్ పట్నాయిక్ ముంబైలో శస్త్ర చికిత్స జరిగి కోలుకుని తిరిగి అనంతరం శనివారం భువనేశ్వర్ చేరుకున్నారు. ఆయనను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు పరామర్శించారు. వారిలో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, గజపతి జిల్లా బీజేడీ అధ్యక్షులు ప్రదీప్ నాయక్, గుసాని సమితి చైర్మన్ ఎన్.వీరరాజు, గుసాని జోన్ 6 జెడ్పీటీసీ ఎస్.బాలరాజు, పట్టణ బీజేడీ అధ్యక్షులు సిత్తు మహాపాత్రో, బప్పి పట్నాయిక్ ఉన్నారు.

### తేనెటీగల దాడిలో మహిళ మృతి



మృతి చెందిన గుమి మినియాకా



ఆస్పత్రిలో జులి మినియాకా

కొరాపుట్: తేనెటీగల దాడిలో ఓ మహిళ మృతి చెందగా మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి కుటింగా గ్రామ పంచాయతీకి చెందిన గుమి మినియకా (45), జులి మినియాకాలు అటవీ ఉత్పత్తుల సేకరణకి సమీప కొండ పైకి వెళ్లారు. అక్కడ వీరిద్దరిపై తేనెటీగలు మూకుమ్మడిగా దాడి చేశాయి. వీరిద్దరూ ప్రాణ భయంతో గ్రామంలోకి పరుగులు పెట్టగా గిరిజనులు వీరిని రక్షించి లక్ష్మీపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుమి మినియకా మృతి చెందింది. జులి మినియకాకి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వెబ్ జర్నలిస్ట్ దారుణ హత్య



మృతుడు నరేష్ (ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లాలోని మోటు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం గుర్తు తెలియని దుండగుల దాడిలో వెబ్ జర్నలిస్ట్ దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడిని సిహెచ్ నరేష్‌గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. నరేష్ అతని స్నేహితులు మరికొందరు జర్నలిస్టులు కారులో వెళ్తున్న సమయంలో మురళిగుడ గ్రామ సమీపంలో గుర్తు తెలియని ఐదుగురు దుండగులు రెండు బైకులపై వచ్చి అకస్మాత్తుగా కారులో ప్రయాణిస్తున్న వారిపై కత్తులు, మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో నరేష్ తీవ్రగాయాలకు గురయ్యాడు. అతడిని వెంటనే తోటి స్నేహితులు, జర్నలిస్ట్ మిత్రులు మోటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటనే మల్కనగిరి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎఫ్‌ఎం కళాశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- ప్రాణాపాయ స్థితిలో కొనసాగుతున్న చికిత్స
- ముఖ్యమంత్రి ప్రత్యక్ష చొరవ



బాధిత యువతి తల్లిని ఓదార్చుతున్న ముఖ్యమంత్రి

భువనేశ్వర్: బాలేశ్వర్ ఫకీర్ మోహన్ కళాశాలలో విద్యార్థిని ఆత్మాహుతియత్నానికి పాల్పడింది. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా కొనసాగుతోంది. సత్వర ఉన్నత చికిత్స కోసం స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్‌లో చేర్చారు. 17 మంది వైద్య నిపుణుల బృందం ఆమెకి చికిత్స అందిస్తోంది. ఈ సంఘటన రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపుతుంది. కళాశాలలో అధ్యాపకుని లైంగిక వేధింపులు తాళలేక నిస్సహాయ స్థితిలో అమాయక విద్యార్థిని ఈ అఘాయిత్యానికి పాల్పడిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆమె అభ్యర్థనపై అధికార, ప్రభుత్వ యంత్రాంగం సకాలంలో స్పందించి ఉంటే ఇంతటి అపాయకర పరిస్థితి తలెత్తేది కాదని అన్ని వర్గాలు వాపోతున్నాయి. రాష్ట్రంలో అన్ని వర్గాల మహిళలకు కనీస రక్షణ, భద్రత లేకుండా పోయిందనే ఆరోపణలకు ఈ సంఘటన నిలువెత్తు తార్కాణంగా నిలుస్తుంది.

**విమానాశ్రయంలో అత్యవసర సమావేశం**

ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యక్షంగా చొరవ తీసుకున్నారు. రాష్ట్రానికి చేరిన మరుక్షణమే కార్యాచరణకు నడుం బిగించారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాంగణంలో అత్యవసరంగా అత్యున్నత సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్, రాష్ట్ర ఉన్నత విద్యా మంత్రి సూర్యవంశీ సూరజ్ పాల్గొన్నారు. ప్రభుత్వ చీఫ్ సచేతక్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై వీరందరితో ముఖ్యమంత్రి చర్చించారు. సంఘటన పూర్వాపరాలపై మంత్రి వర్గం, పార్టీ ఎమ్మెల్యేలతో చర్చించిన అనంతరం విమానాశ్రయం నుంచి నేరుగా బాధిత యువతి చికిత్స పొందుతున్న ఎయిమ్స్ ఆస్పత్రికి తరలివెళ్లారు.



ఆత్మాహుతి బాధితురాలికి చికిత్స చేస్తున్న వైద్య నిపుణుల బృందంతో ముఖ్యమంత్రి చర్చలు

**కుటుంబీకులకు ఓదార్పు**

మృత్యు పోరాటం చేస్తున్న కూతురి కోసం ఆస్పత్రి ప్రాంగణంలో భోరుమంటున్న బాధిత యువతి తల్లిదండ్రులు, కుటుంబీకులు ఇతర బంధు మిత్ర వర్గాన్ని ముఖ్యమంత్రి ఓదార్చారు. ప్రభుత్వం అండగా నిలిచి సముచిత చర్యల్ని చేపడుతుందని భరోసా ఇచ్చి ఊరట కలిగించారు.



బాధిత యువతి తండ్రిని ఓదార్చుతున్న ముఖ్యమంత్రి

### అత్యున్నత వైద్య సంరక్షణ కల్పిస్తాం: ముఖ్యమంత్రి

విమానాశ్రయం నుంచి ఎయిమ్స్ సందర్శించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి బాధిత యువతికి చికిత్స కల్పిస్తున్న వైద్య నిపుణుల బృందంతో ప్రత్యక్షంగా చర్చించారు. ప్రాణాలు కాపాడేందుకు అత్యున్నత స్థాయి వైద్య, చికిత్స కల్పించాలని వైద్య బృందానికి ఆదేశించారు. ఢిల్లీ ఎయిమ్స్ వైద్య నిపుణుల బృందంతో ప్రత్యక్ష సంప్రదింపులతో అత్యున్నత స్థాయి చికిత్స కొనసాగిస్తున్నట్లు వైద్య బృందం వివరించింది. ప్రస్తుతం బాధిత యువతి ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్నందున ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించేందుకు ఏమాత్రం సాధ్యం కావడం లేదని విచారం వ్యక్తం చేశారు. మరో 24 నుంచి 48 గంటల పాటు ఆమె ప్రాణాపాయ స్థితి పట్ల అస్పష్టత కొనసాగుతుందని తెలిపారు. వైద్య బృందం వివరణ తర్వాత ముఖ్యమంత్రి స్పందిస్తూ ఏమాత్రం అవకాశం కలిసి వచ్చిన, మరు క్షణమే ఎయిర్ అంబులెన్సులో ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించాలని ఆదేశించారు. ఉన్నత స్థాయి చికిత్స కల్పించడంలో ఎటువంటి జాప్యం సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ విచారకర సంఘటనకు ప్రేరేపించిన పరిస్థితులు, బాధ్యులైన వారిని గుర్తించడం తదితర కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుంది. నివేదిక ఆధారంగా బాధ్యులైన వారి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ముఖ్యమంత్రి అభయం ఇచ్చారు.

## కొరియా సందర్శించిన రాష్ట్ర టూరిజం సెక్రటరీ



కొరియాలో నోడల్ అధికారి బల్వంత్ సింగ్, కలెక్టర్ కీర్తి వాసన్ పర్యటన



పొట్టంగి సమితిలో నిర్మాణ పనుల పరిశీలన



స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్ర పరిశీలన

కొరాపుట్: రాష్ట్ర టూరిజం సెక్రటరీ బల్వంత్ సింగ్ ఆంధ్ర–ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియాని సందర్శించారు. ఆదివారం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా పంచాయతీ కేంద్రానికి వెళ్లారు. కొరాపుట్ జిల్లాకి నూతన నోడల్ అధికారి హోదాలో ఈ పర్యటన జరిగింది. కొఠియాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పర్యాటక రంగ నిర్మాణాలు చూశారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం, సంగన్న హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, దేవమలి పర్వతం, గాలి గబ్బర్ జలపాతం, కెచ్చల పర్యటక ప్రాంతం పరిశీలించారు. లక్ష్మీపూర్ సమితి కేంద్రంలో జిల్లాస్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ పర్యటనలో కొరాపుట్ కలెక్టర్ వీ.కీర్తి వాసన్, అన్ని శాఖల ఉన్నతాధికారులు ఉన్నారు.

### గవర్నర్ జోక్యం చేసుకోవాలి: నవీన్ పట్నాయక్



బాధిత యువతి చికిత్స బాగోగులు సమీక్షించేందుకు ఎయిమ్స్ చేరిన విపక్ష బీజేడీ ప్రతినిధి బృందం

భువనేశ్వర్: బాలేశ్వర్ ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని గోడు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడంపై విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలో ఆమె పట్ల జరుగుతున్న వేధింపులకు సంబంధించి సాంఘిక మాధ్యమంలో గోడు పెట్టుకున్న కళాశాల ప్రిన్సిపాల్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్రాల విద్యా శాఖ మంత్రులు పెడ చెవి వైఖరి ప్రదర్శించి విద్యార్థిని ప్రాణాపాయ పరిస్థితిలోకి నెట్టేయడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. ఈ నెల ఒకటో తేదీన సహాయం కోసం సోషల్ మీడియాలో ఆమె చేసిన అభ్యర్థనలను ఏ ఒక్కరూ పట్టించుకోలేదని నవీన్ పట్నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలో ఉపాధ్యాయుడు తన పట్ల పదే పదే లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు సోషల్ మీడియాలో బహిరంగంగా తెలియజేసినా బాధ్యులైన ఏ ఒక్కరు యువతి పరిస్థితి పట్ల స్పందించక పోవడంతో కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్ వెలుపల తనను తాను నిప్పంటించుకునేందుకు పాల్పడిందని తేటతెల్లం అవుతుందన్నారు. ఇది అత్యంత విచారకర సంఘటనగా నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు. ఫకీర్ మోహన్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్‌గా రాష్ట్ర గవర్నర్ జోక్యం చేసుకుని న్యాయం జరిగేలా చూడాలని నవీన్ పట్నాయక్ కోరారు. తీవ్రమైన కాలిన గాయాల నుండి బాధిత యువతి త్వరగా కోలుకోవాలని జగన్నాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

**విద్యార్థి వర్గం ధర్నా**

ఈ విచారకర సంఘటన పట్ల బిజూ జనతా దళ్ యువజన, విద్యార్థి విభాగాల సభ్యులు ముఖ్యమంత్రి నివాసం వెలుపల నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# 3 రోజుల్లో నివేదిక సమర్పించాలి

- జాతీయ మహిళా కమిషన్

భువనేశ్వర్: బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని ఆత్మాహుతి సంఘటన పట్ల జాతీయ మహిళా కమిషన్ ప్రత్యక్షంగా స్పందించింది. ఈ నేపథ్యంలో చొరవ కల్పించుకుని తక్షణ దర్యాప్తు కోసం ఆదేశించింది. దర్యాప్తు నిష్పక్షపాతంగా నిర్వహించాలని స్పష్టం చేయడం విశేషం. చేపట్టిన చర్యల సమగ్ర సమాచారంతో 3 రోజుల్లో దర్యాప్తు నివేదిక దాఖలు చేయాలని రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్‌కు ఆదేశించింది. ఇది అత్యంత విచారకరమైన సంఘటనగా మహిళా కమిషను ఆవేదన వ్యక్తం చేసింది. బాధిత యువతికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించింది.

**క్రైమ్ శాఖ దర్యాప్తు**

విద్యార్థిని ఆత్మాహుతి సంఘటనపై దర్యాప్తు చేయడానికి రాష్ట్ర క్రైమ్ శాఖ రంగంలోకి దిగింది. మహిళా విభాగానికి చెందిన ఇద్దరు సభ్యుల బృందం దర్యాప్తు చేస్తుంది. ఈ బృందంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్, డీఎస్పీ హోదా కలిగిన ఇరువురు మహిళా అధికారుల్ని సభ్యుల్ని నియమించారు. ఈ బృందం ఫకీర్ మోహన్ కళాశాలకు చేరుకుంది. కళాశాల ప్రిన్సిపాల్‌తో చర్చలు జరుపుతుంది. తర్వాత అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ), బాధితురాలి కుటుంబ సభ్యులతో చర్చలు జరిపి విచారణ కొనసాగిస్తుందని సమాచారం. క్రైం శాఖ స్వతహాగా దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి నివాసం ముట్టడి ఆందోళనలో కాంగ్రెస్ వర్గాలు

**విద్యా శాఖ బృందం దర్యాప్తు**

ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థి ఆత్మాహుతి యత్నం సంఘటనపై రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ దర్యాప్తునకు ఆదేశించింది. 3 మంది సభ్యులతో కూడిన బృందం దర్యాప్తు నిర్వహించింది. ప్రిన్సిపాల్, అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ)ని దర్యాప్తు బృందం ప్రశ్నించింది. త్వరలో ప్రభుత్వానికి తుది నివేదిక సమర్పించనున్నట్లు బృందం తెలిపింది.

**హోరెత్తుతున్న నిరసనలు**

బాలాసోర్ విద్యార్థిని ఆత్మాహుతి ఘటనతో రాష్ట్రంలో నిరసనలు హోరెత్తుతున్నాయి. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దారుణాలకు నిరసనగా యువజన, విద్యార్థి కాంగ్రెస్ ముఖ్యమంత్రి నివాసాన్ని చుట్టుముట్టింది. ఉన్నత విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఉన్నత విద్యా శాఖ మంత్రి సూరజ్ సూర్యవంశీ ఇంటి ముందు ఒడిశా కాంగ్రెస్ నిరసనలు ప్రదర్శించారు.

## చదువు కావాలంటే పడవ నడపాల్సిందే..



సునాబెడా ప్రాంతంలో లంజిగుడ–గట్టుగుడల మధ్య పడవలో వెళ్తున్న విద్యార్థులు

- ప్రమాదకర ప్రయాణం చేస్తున్న విద్యార్థులు
- నెరవేరని వంతెన నిర్మాణం

కొరాపుట్: విద్యా కోసం ప్రాణాంతకర ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు కొరాపుట్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో నెలకున్నాయి. గట్టుగుడ నుంచి లంజిగుడ గ్రామాల మధ్య కొలాబ్ నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని చాలా ఏళ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అయితే వారి డిమాండ్‌ను ఏ ప్రభుత్వం కూడా నెరవేర్చలేదు. దీంతో సునాబెడ పట్టణానికి వెళ్లేందుకు గట్టుగుడ ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొలాబ్ నదిపై వంతెన నిర్మిస్తే వీరి కష్టాలు తీరుతాయి. దీన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో నాటు పడవపై సుమారు ఐదు గ్రామాల ప్రజలు ప్రమాదకరంగా నదిని దాటివెళ్లి సునాబెడ పట్టణానికి చేరుకుంటున్నారు. పడవ ప్రయాణం వద్దనుకుంటే సుమారు 15 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లి సునాబెడ పట్టణానికి చేరుకోవాల్సి ఉంటుంది. దీంతో అంగన్‌వాడీ వర్కర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక ప్రజలు తప్పనిసరి పరిస్థితిలో పడవ ప్రయాణం చేసే సునాబెడకు చేరుకుంటారు. అయితే విద్యార్థుల పరిస్థితి మాత్రం మరీ ఘోరంగా ఉంది. సునాబెడలోని పాఠశాలలకు వెళ్లేందుకు నాటు పడవపైనే వంతెనను దాటి చేరుకుంటారు. దీంతో ఏ క్షణాన ఎలాంటి ప్రమాదం ముంచుకువస్తుందోనని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి పడవను నడిపేవారు లేకపోతే పిల్లలే కర్రతెడ్డే సాయంతో పడవను నడుపుతుంటారు. ప్రస్తుతం ఇలాంటి ఫొటోలు సోషల్ మీడియాలో వెలుగు చూడడం వివాదాస్పదమైంది. గతంలో ప్రజలే స్వయంగా తాత్కాలికంగా కర్ర వంతెన నిర్మించారు. అయితే అది కూడా వర్షాలకు కూలి పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వ పాలకులు, నాయకులు స్పందించి నదిపై వంతెన నిర్మాణం చేపటాటలని ప్రజలు కోరుతున్నారు.



విద్యార్థులే పడవను నడుపుతున్న దృశ్యం

## గుప్తేశ్వరంలో బోల్‌భం ఏర్పాట్ల పర్యవేక్షణ



గుప్తేశ్వరంలో శివలింగం దర్శించుకుంటున్న కొట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుధర బోత్ర



శబరి నది మార్గంలో పర్యటన

కొరాపుట్: సహజ సిద్ధ పుణ్యక్షేత్రం గుప్తేశ్వరంలో భోల్‌భం ఏర్పాట్లను కొట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుధర్ బోత్ర పర్యవేక్షించారు. ఆదివారం కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి దండకారణ్యంలోని ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఉత్కళ శ్రావణ మాసంలో ప్రతి సోమవారం సుమారు 50 వేలకి పైగా భోల్‌భం భక్తులు ఈ క్షేత్రాన్ని సందర్శిస్తారు. పవిత్ర జలాన్ని కావిడితో మోసుకుని కాలి నడక చేరుకుని ఆ జలం తో శివ లింగానికి అభిషేకం చేస్తారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఈ అభిషేకాలు ప్రారంభం అవుతాయి. ఒడిశాతో పాటు ఆంధ్ర ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బంగా రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో సమీప శబరి నది, వాహనాల పార్కింగ్, గుహకి వెళ్లే మార్గంలో మెట్లు, క్షేత్ర పరిసర ప్రాంతాలు, నిర్మితం అవుతున్న రహదారులను ఎమ్మెల్యే పరిశీలించారు.

## మజ్జి గౌరి మందిరానికి భక్తుల తాకిడి



బారులు తీరిన భక్తులు



మజ్జిగౌరి అమ్మవారు

రాయగడ: ఆంధ్ర, ఒడిశా ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జి గౌరి అమ్మవారి మందిరం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఇటు తెలుగు రాష్ట్రాలతో పాటు అటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనం కోసం రావడంతో మందిరం ప్రాంగణం పూర్తిగా భక్తులతో నిండిపోయింది. అమ్మవారి ప్రత్యేక దర్శనం మూడు వందల టికెట్‌ను తీసుకుని వేగంగా దర్శనం చేసుకుందామనుకున్న భక్తులకు దర్శనం కోసం సుమారు 5 గంటల సమయం పట్టింది. అదేవిధంగా సాధారణ దర్శనంలో ఉన్న భక్తులకు 8 గంటల సమయం వరకు పట్టింది. దీంతో విసుగెత్తిన భక్తులు ఆరుబయటే అమ్మవారిని మొక్కుకుని వెనుతిరిగి వెళ్లడం కనిపించింది. భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



భక్తులతో కిటకిటలాడిన మందిర ప్రాంగణం

## బంగారం దొంగలు అరెస్ట్

- సొత్తు స్వాధీనం



పట్టుబడ్డ నిందితులతో నబరంగ్‌పూర్ పోలీసులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర పోలీసులు దొంగలను అరెస్ట్ చేసి బంగారం రికవరీ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా కేంద్ర పోలీస్ స్టేషన్ ఐఐసీ ఆదివారం వివరించారు. ఈ నెల ఐదో తేదీన జిల్లా కేంద్రంలోని సుంకారివీధికి చెందిన ఎన్.సంతోష్ కుమార్ నాయుడు ఇంట్లో దొంగలు పడి బంగారు ఆభరణాలు పట్టుకుపోయారు. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు పట్టణంలో లోహరి వీధికి చెందిన జగా హరిజన్, కొడింగా పోలీస్ స్టేషన్ పరిధిలోని భలుగుడ గ్రామానికి చెందిన సుభాష్ బోత్రలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 59 గ్రాముల బరువు ఉండే నాలుగు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులు

## క్లుప్తంగా

### ఉపాధ్యాయుల గృహదీక్ష



కోప్టలో గృహదీక్ష చేస్తున్న ఉపాధ్యాయులు

**రణస్థలం:** డీఎస్సీ–2003 ఫోరం పిలుపు మేరకు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 2003 బ్యాచ్ ఉపాధ్యాయులు గృహ దీక్ష చేపడుతున్నారని ఆపస్ మండల అధ్యక్షుడు జి.చిన్నికృష్ణంనాయుడు, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి బి.చిన్నంనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెమో 57 మేరకు అర్హత కలిగిన అందరికి పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే శాంతియుత నిరసనకు కుటుంబ సమేతంగా అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు.

### దుండగులను కఠినంగా శిక్షించాలి



ధ్వంసమైన విగ్రహాలను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

**జి.సిగడాం:** డి.ఆర్.వలసలో ఈ నెల 12న శనీశ్వరుడి ఆలయంలో విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆలయం కమిటీ సభ్యులు, గ్రామస్తులు కోరారు. ఆదివారం ఆలయంలో విగ్రహాల పరిస్థితిని పరిశీలించారు. పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని సర్పంచ్ కుమరాపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ కుమరాపు రమేష్‌నాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, ఆలయ శిల్పి కుమరాపు రామినాయుడు, కుమరాపు చిన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

### వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

**సారవకోట :** పెద్దలంబ పంచాయతీ కురమన్నపేటకు చెందిన కలుగు నారాయణరావు(39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సారవకోట మండలం నారాయణపురం నుంచి పాతపట్నం మండలం కొయ్యకొండ వెళ్లే మార్గంలోని మామిడి తోటలో మేకలు, గొర్రెలకాపరులు ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించారు. స్థానికులకు సమాచారమివ్వగా వారు సారవకోట పోలీసులకు సమాచారమిచ్చారు. వ్యక్తి మృతిచెంది రెండు, మూడు రోజులు కావడంతో గుర్తుపట్టలేని విధంగా మారింది. కొద్దిసేపటి తర్వాత కురమన్నపేటకు చెందిన నారాయణరావుగా అనుమానించి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. నారాయణరావుకు భార్య హిమవతి, కుమార్తెలు ఉష, లలిత ఉన్నారు. నారాయణరావు నిత్యం మద్యం సేవించి భార్యతో గొడవపడుతుండేవాడు. దీంతో ఆమె కొన్నాళ్లుగా వేరుగా ఉంటోంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**సారవకోట:** అంగూరు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అద్దపనస గ్రామానికి చెందిన వెలమల రామారావు తీవ్ర గాయాల పాలయ్యాడు. చల్లవానిపేట నుంచి వెంకటాపురం వైపు వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న రామారావు గాయపడటంతో 108 వాహనంలో నరసన్నపేట ఆస్పత్రికి తరలించారు.

### ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

- అధికారి వేధింపులే కారణమంటున్న బంధువులు

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** శ్రీకాకుళం నగరంలో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం–2లో పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో సిలగాంకు బదిలీ అయిన ఉడుకుల రాంబాబు (44) ఆదివారం గుండెపోటుతో మరణించారు. ఆకస్మిక బదిలీ, ఒత్తిళ్లే ఇందుకు కారణమని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. రాంబాబు ఈ నెల 7 వరకు శ్రీకాకుళం బాలుర వసతి గృహంలోనే పనిచేశారు. వాస్తవంగా బదిలీ అయ్యే అవకాశం లేకపోయినా అక్కడి సంక్షేమాధికారి సిఫారసులు, వేధింపుల వల్ల రాంబాబును బదిలీ చేశారని, బదిలీ వద్దని ఎంత మొరపెట్టుకున్నా కనికరించలేదని బంధువులు చెబుతున్నారు. వసతి గృహ సంక్షేమాధికారి చెప్పిన మాటలు విని వాస్తవిక పరిస్థితులు తెలుసుకోకుండా బీసీ సంక్షేమాధికారిణి అడ్డగోలుగా బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాంబాబు స్వస్థలం విజయనగరం జిల్లా డెంకాడ మండలం పాలెం గ్రామం. భార్య రమాదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



రాయగడ: మొక్కలతో సీఆర్పీఎఫ్ జవాన్లు, విద్యార్థులు



కొరాపుట్: మొక్కలు నాటుతున్న సీవా సంస్థ సభ్యులు



కొరాపుట్: గగనాపూర్‌లో సీవా సంస్థ సభ్యులు

**రాయగడ:** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని సీఆర్పీఎఫ్ నాలుగో బెటాలియన్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు గెడల అన్నారు. జిల్లాలోని మునిగుడ సమితి అంబొదల సమీపంలో గల పయిలాపడ గ్రామంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని సీఆర్పీఎఫ్ జవాన్లు నిర్వహించారు. రఘుబారి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 800 మొక్కలను నాటారు.

**సీవా సంస్థ ఆధ్వర్యంలో..**

**కొరాపుట్:** పర్యావరణ పరిరక్షణలో మరో భారీ కార్యక్రమం జరిగింది. ఆదివారం జయపూర్ సమీపంలోని గగనాపూర్ వద్ద ప్రభుత్వ భూమిలో పర్యావరణం కోసం గత 27 సంవత్సరాలుగా పనిచేస్తున్న సోషల్ ఎన్విరానామెంటల్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (సీవా) వన యజ్ఞం చేసింది. అటవీ శాఖ అందించిన వేయి మొక్కలు నాటడానికి శ్రీకారం చుట్టింది. తొలి రోజు భారీ ఎత్తున మొక్కలు నాటారు. గగనాపూర్ శివ మందిర పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు. సీవాకి చెందిన జీవీ రెడ్డి, సుధాకర్ పట్నాయక్, వినాయక్ మహాపాత్రో, ప్రతాప్ పట్నాయక్, కిల్లంశెట్టి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

**జయపురంలో..**

**జయపురం:** 'ఒక మొక్క అమ్మ పేరున' కార్యక్రమంలో జయపురం సమితి యు.పి.ఎస్ ప్రాంతీయ సాధనా కేంద్రంలో ఆదివారం వనమహోత్సం వారోత్సవాలు నిర్వహించారు. జయపురం బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి చందన కుమార్ ఆదేశాల మేరకు సి.ఆర్.సి.ఎస్ విజయలక్ష్మీ స్త్వెయ్ పర్యవేక్షణలో మొక్కలు నాటారు. అబిజాన్‌లో హనాగుడ ప్రాథమిక పాఠశాల, గొడియ దొబాసాయి ప్రాథమిక పాఠశాల, పంజార హౌస్ కాలనీ పాఠశాల, సాంతరా సాహి పాఠశాల, ఎక్స్ బోర్డు మహమ్మదన్ పాఠశాల, సరస్వతీ బాల మందిరం, జయనగర్ ఆశ్రయం పాఠశాల, జయనగర్ ఉన్నత పాఠశాల, పాయిక వీధి పాఠశాల, సునారి సాహి ప్రభుత్వ యూపీఎస్ పాఠశాల, జగదీష్ చంద్రనాయక్ ఉన్నత పాఠశాల, మునిసిపాలిటీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం ఈ నెల 15వ తేదీ వరకు ఉంటుందని విజయలక్ష్మీ స్త్వెయ్ తెలిపారు.

**జయపురంలో..**

**జయపురం:** జయపురం తెలుగు సంస్కృతిక సమితి నిర్వహిస్తున్న జయపురం సిటీ ఉన్నత పాఠశాల



జయపురం: వన మహోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



గగనాపూర్ అటవీ ప్రాంతంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ద్వారా ఆదివారం జయపురం సమితి గగణాపూర్ గ్రామ ప్రాంతంలో వన మహోత్సవం నిర్వహించారు. స్థానిక స్వచ్ఛంద సంస్థ సోషియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (సీవా)సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 26 మంది ఎకో క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు. వారితోపాటు పీఈటీ రీటా సామంత రాయ్, పాఠశాల ఉపాధ్యాయులు ధనపతి భొత్ర, సోన, సిటీ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ మీడియం ప్రిన్సిపాల్ సుధాకర పట్నాయక్ పాల్గొన్నారు. ఈ వన మహోత్సవ కార్యక్రమంలో వివిధ రకాల 1,000 మొక్కలు నాటినట్లు ఎకో క్లబ్ ఇన్‌చార్జి, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు ప్రతాప్ కుమార్ పట్నాయక్ తెలిపారు. రానున్న ఆదివారం కూడా వనమహోత్సవం నిర్వహిస్తామని, 2,500 మొక్కలు నాటాలన్న లక్ష్యంతో ఉన్నామని వెల్లడించారు. జయపురం పాఠశాల నుంచి గగణాపూర్ గ్రామానికి ఎకో క్లబ్ విద్యార్థులు సైకిళ్లపై వెళ్లారు.



వన మహోత్సవాలకు సైకిళ్లపై వెళ్లిన విద్యార్థులు



గగణాపూర్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థినులకు మొక్కలు నాటే విధానాన్ని బోధిస్తున్న ఉపాధ్యాయుడు

## గిరిజన సంస్కృతిపై ప్రత్యేక రచనలు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు గౌరీ శంకర్ మజ్జి, రుపుధర్ బోత్రలు

**కొరాపుట్:** గిరిజన సంస్కృతిపై ప్రత్యేక పరిశోధనాత్మక రచనలను ఎమ్మెల్యేలు ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. జయపూర్ పట్టణంలో ఎస్ఆర్ మాల్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీకి చెందిన కొరాపుట్ జిల్లా కొట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుధర్ బోత్ర, నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జిలు వీటిని ఆవిష్కరించి ప్రజల అందుబాటులోకి తెచ్చారు. సీనియర్ గిరిజన పండితుడు, మాజీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రమొదిని హత్తా రచించిన గిరిజన సాంస్కృతిక నేపథ్యం, డాక్టర్ దేవి ప్రసాద్ హత్తా రచించిన గిరిజన ప్రజల పురోగతి పుస్తకాలు విడుదల చేశారు. ఈ పుస్తకాలను కొరాపుట్ జిల్లా



హాజరైన కవులు, పండితులు

గిరిజన సంస్కృతిని సజీవంగా ఉంచుతాయని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు గౌతం సామంత్రాయ్, కవులు, పండితులు పాలొగన్నారు.

## ట్రైన్ నుంచి జారిపడి సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు గాయాలు

**రాయగడ:** ట్రైను నుంచి ప్రమాదవశాత్తు జారిపడిన ఘటనలో సీఆర్‌పీఎఫ్ జవాన్ తీవ్రగాయాలకు గురయ్యాడు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో గాయాలు తగిలిన వ్యక్తి శరత్ మాఝిగా పోలీసులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న రాయగడ సీఆర్‌పీఎఫ్ బృందం సంఘటనా స్థలంకు చేరుకుని గాయపడిన మాఝిని కల్యాణ సింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. రౌర్‌కలా–జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో కొరాపుట్ నుంచి బలంగీర్ వైపు ప్రయాణిస్తున్న సమయంలో లెల్లిగుమ్మ రైల్వే స్టేషన్ సమీపంలో జవాన్ అదుపు తప్పి నడుస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో గాయాలకు గురయ్యాడు. అయితే ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని



చికిత్స పొందుతున్న జవాన్ మాఝి

వైద్యులు వెల్లడించారు. అనంతరం అతనికి జిల్లా కేంద్రాస్పత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు.

## 22 కిలోల గంజాయి స్వాధీనం



అరెస్టయిన నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ సిబ్బంది

**కొరాపుట్:** అక్రమ గంజాయి రవాణా గుట్టురట్టయింది. జయపూర్ ఎక్సైజ్ పోలీసులు ఆదివారం పాత్రోపుట్ సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో పెట్రోల్ బంక్ సమీపంలో కొందరు అనుమానాస్పదంగా సంచరిస్తూ గమనించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా.. వారి వద్ద ఉన్న బస్తాలో 22 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులు మధ్యప్రదేశ్‌కి చెందిన బోలే గో స్వామి, మకాడొసిగా గుర్తించారు. గంజాయిని సీజ్ చేసి నిందితులను కోర్టులో హాజరు పరచగా జడ్జి వారికి రిమాండ్ విధించంతో జైలుకు తరలించారు. రేంజ్ ఇన్‌స్పెక్టర్ శశికాంత్ దత్ దర్యాప్తు చేస్తున్నారు.

## బాలియాత్ర నిర్వహణకు కమిటీ

**జలుమూరు:** రాష్ట్ర పండగగా బాలియాత్ర నిర్వహించేందుకు కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు యాత్ర కమిటీ ప్రతినిధి డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు తెలిపారు. బాలియాత్ర నిర్వహణకు సంబంధించి ఆదివారం 20 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీముఖలింగం ఆలయ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ కటక్‌లో కార్తీక పౌర్ణమి నుంచి వారం రోజుల పాటు యాత్ర జరగనుందని, శ్రీముఖలింగంలో ఏ తేదీన నిర్వహించాలనే విషయమై వారంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. యాత్ర విజయవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ టి.బలరాం, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ పెద్దలు బి.వి.రమణ, తేజేశ్వరరావు, వేణు, చింతాడ వెంకటరావు, ఉపాధ్యాయులు, అర్చకులు పాల్గొన్నారు.



శ్రీముఖలింగం ఆలయ ఆవరణలో బాలియాత్ర కమిటీ సభ్యులు

### గుండాల్ సర్పంచ్ మృతి

**జయపురం:** జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితిలో కొత్తగా ఏర్పాటు చేసిన గుండాల గ్రామ పంచాయతీ సర్పంచ్ భక్త ఖోస్ల (40) శనివారం తన స్వగృహంలో మృతి చెందారు. గత రెండేళ్లగా ఖోస్ల క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య శశి కలాపి, కుమారుడు ఉన్నారు. 2017లో గుండాల్ పంచాయతీగా ఏర్పడగా ప్రథమ సర్పంచ్‌గా అతడి భార్య శశి కలాపి పనిచేశారు. రెండోసారి జరిగిన ఎన్నికలలో ఖోస్ల సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బంధువులు సంతాపం తెలియజేశారు.

### విద్యుదాఘాతంతో ఏనుగు మృతి



మరణించిన ఏనుగు

**భువనేశ్వర్:** పశ్చిమ ఒడిశా సంబల్‌పూర్ జిల్లాలో విద్యుదాఘాతంతో ఏనుగు మృతి చెందింది. ఈ సంఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ముఖ్యమంత్రి ఆదేశించారు. రెఢాఖోల్ అటవీ ప్రాంతం నకొటిదెవులో రేంజ్ టికిలి పాడా గ్రామ సమీపంలో ఈ సంఘటన ఆదివారం జరిగింది. అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ కావడంతో భువనేశ్వర్ నుంచి ప్రత్యేక బృందం ఘటనా స్థలానికి బయల్దేరింది.

### బ్రిటీష్ కాలం నాటి రైల్వేవంతెన తొలగింపు



క్రేన్ సాయంతో పాత వంతెనను తొలగిస్తున్న అధికారులు

**వజ్రపుకొత్తూరు:** మారుతున్న కాలం, టెక్నాలజీ అందిపుచ్చుకుంటున్న భారత రైల్వే కొత్త బాటలో పయనిస్తోంది. పాతవి జ్ఞాపకాలే అయినా ప్రజలకు చేరువయ్యేలా సేవలు అందించాలన్నది లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అందులో భాగంగా బ్రిటీష్ కాలం నాటి కట్టడాలను తొలగిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం వజ్రపుకొత్తూరు మండలం పూండి రైల్వే స్టేషన్‌లో భారీ క్రేన్‌ల సాయంతో పాత కాలినడక వంతెనను తొలగించే పనులు చేపట్టింది. కేవలం 8 గంటల్లోనే వంతెన మొత్తాన్ని విడిభాగాలు చేసి తొలగించింది. కింది భాగంలో 25వేల కిలోవాట్‌ల విద్యుత్ తీగలు ఉన్నప్పటికీ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పనులు పూర్తి చేశారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వేలో చివరి స్టేషన్‌గా ఉన్న పూండికి వాల్తేరు డివిజన్ నుంచి ప్రధాన ఇంజినీర్లు, టెక్నికల్ బృందం వచ్చి తొలగింపు పనులు చేపట్టారు. వంతెన తొలగింపునకు ముందే మూడు నెలలు కిందట సమాంతరంగా కొత్త వంతెన నిర్మించారు.

## విద్యా మందిరంలో గురుపూజోత్సవం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ సనాతన ప్రధాన్

**జయపురం:** జయపురం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) విభాగం వారు ఆదివారం స్థానిక శారదా విహార్ విద్యామందిర ప్రాంగణంలో శ్రీగురు దక్షిణ ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవంలో పశ్చిమ ప్రాంత ఆర్ఎస్ఎస్ సంఘ పరిచాలక్ ప్రొఫెసర్ సనాతన ప్రధాన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జయపురం పట్టణ ఆర్ఎస్ఎస్ పరిచాలక్ డాక్టర్ నిరంజన్ ప్రధాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సనాతన ప్రధాన్ ప్రసంగిస్తూ.. గురు దక్షిణ ఉత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఉపాధ్యాయులు, గురువులు మనలను విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్ది మంచి మనషులుగా సమాజానికి అందిస్తారన్నారు. అటువంటి మహానీయులైన గురువులను పూజించి వారికి గురుదక్షిణ ఇవ్వడం అనాదిగా వస్తున్న సంప్రదాయం అని వివరించారు. గురువులు పూజ్యనీయులని బ్రహ్మ, విష్ణు, పరమేశ్వర స్వభావులన్నారు. అందుచేత గురువు మనకు విద్య నేర్పినందుకు గురు దక్షిణ ఇవ్వడం సంప్రదాయమన్నారు. ఈ రోజున మన శక్తి, సామర్థ్యలను బట్టి గురువులకు గురు దక్షిణ సమర్పించే కార్యక్రమాలను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నిర్వహిస్తున్నదని వివరించారు. ఈ సందర్భంగా పలువురు గురువులకు గురుదక్షణలు సమర్పించి వారి ఆశీర్వాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రముఖ ఉపాధ్యాయులు ముకుంద భోయి, సుబ్రత్ కుమార్ పండ పాల్గొన్నారు.

## బోల్‌భం భక్తులపైకి దూసుకెళ్లిన అగ్నిమాపక శకటం



ప్రమాదానికి కారణమైన అగ్ని మాపక శకటం



కూలిన తాత్కాలిక షెల్టర్లు



ఘటనా స్థలంలో గూమి గూడిన భోల్ భం భక్తులు

**కొరాపుట్:** కొరాపుట్ జిల్లా జయపూర్ సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితిలోని దండకారణ్యంలో డొక్రి ఘాట్–గుప్తేశ్వరం మధ్య సుకునాల్ మలుపు వద్ద ప్రభుత్వ అగ్ని మాపక శకటం బ్రేక్ ఫెయిలై బోల్‌భం భక్తులపైకి దూసుకెళ్లింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో కెందుగుడ గ్రామానికి చెందిన పురుషోత్తం దురువా (10) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ బాలుడి మరో ఇద్దరు అన్నలు తీవ్రంగా గాయపడ్డారు. ఇదే ప్రమాదంలో మరికొంత మందికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు బాధితులను బొయిపరిగుడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## సింగుపుటిలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేష్

**రాయగడ:** సదరు సమితి సింగుపుటి గ్రామంలో స్థానిక సత్యసాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ సురేష్ కుమార్, జిల్లా అదనపు ముఖ్యవైద్యాధికారి డాక్టర్ మమత చౌదరి, డాక్టర్ ఎల్ఎన్ సాహు సుమారు 87 మందికి వివిధ వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొంతమందికి నేత్ర శస్త్రచికిత్స అవసరం ఉందని గుర్తించారు. వారిని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు తరలించి సమితి ద్వారా ఉచితంగా ఆపరేషన్లను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## క్లుప్తంగా

### ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బల్లా శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయుఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా బల్లా శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాలాజీ ప్రకటించారు. ఇంతవరకు ఈ బాధ్యతలను చేపట్టిన వీవీజే సుబ్రహ్మణ్యంను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణానికి వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ స్థానిక సంఘం కార్యాలయంలో ఈ మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

### కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలో ఆదివారం సాయంత్రం కారు ఢీకొనడంతో ఎల్.కోట మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన తూర్పాటి లోకేష్ తీవ్ర గాయాల పాలయ్యాడు. లోకేష్ ద్విచక్రవాహనంపై కొత్తవలస నుంచి స్వగ్రామం సీతారాంపురం వెళ్తుండగా ఎస్.కోట నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో లోకేష్ తలకు తీవ్రగాయాలు కాగా అధికంగా రక్తస్రావం జరిగి అపస్మారస్థితికి చేరుకున్నాడు. స్థానికుల సహాయంతో 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం లోకేష్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఎల్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మరో 200 క్యూసెక్కుల నీరు..



కుడి ప్రధాన కాలువ ద్వారా విడుదలవుతున్న సాగునీరు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీటి విడుదలను ఆదివారం అధికారులు మరింత పెంచారు. గత ఐదు రోజులుగా 100 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు సరఫరా చేయగా, ప్రస్తుతం ఆయకట్టులో దమ్ములు, ఉబాలు ఊపందుకోవడంతో మరో 200 క్యూసెక్కుల అదనపు నీటిని పెంచుతూ మొత్తం 300 క్యూసెక్కుల నీటిని ఆయకట్టు భూములకు విడిచిపెడుతున్నట్టు ఏఈ నితిన్ తెలిపారు. జిల్లాలోని ఏడు మండలాల్లో 30,077 ఎకరాల భూములకు నీటిని సరఫరా చేస్తున్నామని, ప్రాజెక్టు వద్ద 64.54 మీటర్లు లెవెల్ నీటిమట్టం నమోదైందన్నారు.

### కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ధర్నా రేపు

విజయనగరం అర్బన్: తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 15న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రంగ ఉద్యోగ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దింటి అప్పారావు, నారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు గిరడ అప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఈ కార్యక్రమం తలపెట్టినట్టు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన వాల్యుయేషన్ అమైండ్‌మెంట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఎనిమిదో పే కమిషన్, రాష్ట్రంలో 12వ పే కమిషన్ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. డీఏ బకాయిలు తక్షణమే చెల్లించాలని, ఉద్యోగ పెన్షనర్లకు కాంప్రహెన్స్ హెల్త్ ఇన్సురెన్స్ స్కీమ్‌ను అమలు చేయాలని కోరారు. ధర్నాకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పెన్షనర్లంతా తరలి రావాలని సంఘ నేతలు పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలోని పెన్షనర్లంతా ధర్నాకు హాజరు కావాలని మరో ప్రకటనలో సంఘం పట్టణ కమిటీ అధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి త్రినాథప్రసాద్ కోరారు. సంఘటిత పోరాటం ద్వారానే డిమాండ్ల సాధన సాధ్యమవుతుందని దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ ధర్నాలో పాల్గొనాలని వారు కోరారు.

### ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

- ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్

విజయనగరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏ, సరండర్ లీవ్ క్యాష్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ డిమాండ్ చేశారు. స్థానిక ఆపస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల దాటినా పీఆర్‌సీ కమిషన్ నియమించలేదని ఆరోపించారు. వెంటనే కమిషన్ వేసి కనీసం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఇ.రామునాయుడు, అదనపు ప్రధాన కార్యదర్శి చిన్ని శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి సంతోషలక్ష్మి, గౌరవాధ్యక్షులు వీవీ శ్రీహరి, కోశాధికారి ఏజీ తాతారావు, జిల్లా మహిళా ప్రతినిధి పద్మలత, విశాఖ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, వెంకటనాయుడు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# పెట్టిందే తిను

- గిరిజన హాస్టల్స్‌లో అమలు కాని మెను
- భోజనంలో నాణ్యత అంతంతే
- ఆశ్రమ పాఠశాలలపై అంతులేని నిర్లక్ష్యం



తెల్ల అన్నం, పలుచటి రసం వడ్డిస్తున్న కుక్, విద్యార్థి



రసంతో తెల్ల అన్నం, వండిన గుడ్డుతో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

రామభద్రపురం: ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన మెనూ అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పాలకులతో పాటు ప్రభుత్వ అధికారులు ప్రచార ఆర్భాటం చేస్తున్నారు. కానీ వసతి గృహాల్లో మెనూ ప్రకారం మూడు పూటలా నాణ్యమైన ఆహారం అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పేద కుటుంబాలకు చెందిన గిరిజన విద్యార్థులే కదా ఫర్వాలేదు. ఏది వండేసి పెట్టిన తినేస్తారులే అని పాలకులతో పాటు అధికారులూ భావిస్తున్నారు. వసతిగృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులంటే నిర్లక్ష్యం చూపుతున్నారు. అందుకు నిదర్శనం రామభద్రపురం మండలంలోని నేరెళ్లవలస ప్రభుత్వం గిరిజన సంక్షేమ వసతి గృహంలో ప్రభుత్వం అందించిన మెనూ చార్ట్ ప్రకారం విద్యార్థులకు మూడు పూటలా నాణ్యమైన ఆహారం అందడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేక ఆహారంలో నాణ్యత కరువవుతోందని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన ఆశ్రమ పాఠశాలల అండ్ ప్రీ మెట్రిక్ హాస్టల్ వారి ఆహార పట్టిక ప్రకారం ఆదివారం ఉదయం గోధుమపూరీ, బంగాళాదుంప బఠాణీ కుర్మా, ఉడకబెట్టిన గుడ్డు పెట్టాలి. అలాగే ఉదయం అల్పాహారంగా వేరుశనగ చిక్కి ఇవ్వాల్సి ఉంది. మధ్యాహ్నం నాణ్యమైన చికెన్ బిర్యానీ, పెరుగు చెట్నీ, గోంగూర చెట్నీతో భోజనం వడ్డించాలి. అక్కడి నిర్వాహకులు ఇవేవీ పెట్టకుండా మెనూ చార్ట్‌ను పక్కన పడేసి వాటికి బదులుగా ఉదయం గంజి అన్నం, మధ్యాహ్నం తెల్ల అన్నం, రసం, వండిన గుడ్డు పెట్టేసి సరిపెట్టారు.

#### నాణ్యత అంతంతే..

వసతి గృహంలో విద్యార్థులకు పెట్టిన భోజనంలో నాణ్యత అంతంత మాత్రంగానే ఉంది. మెత్తగా ముద్ద అన్నం, పలుచటి చారుతో వడ్డిస్తూ ఆదా చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి భోజనంతో పాటు పండ్లు ఇవ్వాలి కానీ పండ్లు ఇవ్వకుండా నాసిరకం భోజనంతో మమ అనిపిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. చాలా వసతి గృహాల్లో ఆదివారం చికెన్ బిర్యానీకి బదులు కర్రీతోనే సరిపెడుతున్నారు. ఎక్కడా చికెన్ బిర్యానీ ఇవ్వడం లేదని తెలిసింది. బిర్యానీకి తగ్గట్లు ఆహార పదార్థాల సరఫరా లేకపోవడంతో అన్నంతో సరిపెడుతున్నారని సమాచారం.



వండిన గుడ్డు పెడుతున్న విద్యార్థి

#### 55 మందే హాజరు..

జన్నివలస పంచాయతీ పరిధిలోని నేరెళ్లవలస ఆశ్రమ పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 85 మంది ఉన్నారు, ఆదివారం హాస్టల్‌ను పరిశీలించగా 55 మంది విద్యార్థులు మాత్రమే మధ్యాహ్న భోజనంలో కనిపించారు. వారంతా భోజనం చేశారు. రెండు సెలవులు రావడంతో మిగిలిన 30 మంది సొంతూళ్లకు వెళ్లారని ఇక్కడి ఏఎన్ఎం తెలిపారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయక భోజనం అధ్వానంగా ఉండడంతో పాటు తాగునీటి సమస్య ఉంది. వారంతా పాఠశాల ఆవరణలో అపరిశుభ్రతలో ఉన్న కొళాయి ట్యాప్ ద్వారా సరఫరా అవుతున్న నీటినే తాగుతున్న దుస్థితి ఉంది. గిరిజన ఆశ్రమ పాఠశాలలను సంబంధిత అధికారులు కనీస పర్యవేక్షణ చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా ఉండాల్సిన వసతి గృహం వార్డెన్ ఇక్క ఉండడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

#### వార్డెన్ ఇలానే వండమన్నారు..

ఈ రోజు ఉదయం గంజి అన్నం పెట్టాం. మధ్యాహ్నం తెల్లం అన్నం, రసం, గుడ్డు వండమని వార్డెన్ సార్ చెప్పారు. అందుకు ఇలాగే వండాను. ఇటీవల జరిగిన మెగా పేరెంట్స్ కమిటీ మీటింగ్‌కు చికెన్ బిర్యాని వండాం గనుక, ఈ రోజు ఇలాగాఏ వండమంటే ఆయన చెప్పిన విధంగానే వండాను.

లచ్చయ్య, కుక్

#### పేరెంట్స్ మీటింగ్‌లో చికెన్ బిర్యానీ పెట్టాం..

ప్రతిరోజూ మెనూ చార్ట్ ప్రకారం నాణ్యమైన ఆహారం వండిపెడుతున్నాం. కాకపోతే ఈ నెల 10వ తేదీన జరిగిన పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు వచ్చిన తల్లిదండ్రులు, విద్యార్థుల కోసం చికెన్ బిర్యానీ పెట్టడం వల్ల అడ్జెస్ట్‌మెంట్ కోసం ఈ రోజు అన్నం, గుడ్డు వండిపెట్టాం. ఇక నుంచి మెనూ ప్రకారం వండిపెడతాం.

కె. సోములు, వార్డెన్

## గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐఆర్ఓ ఎస్.తవిటినాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్ట్‌ల భర్తీ కోసం అర్హులైన రిటైర్డ్ అధ్యాపకులు, స్కూల్ అసిస్టెంట్స్, లెక్చరర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఫ్రెష్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. డీవీఈఓ ఆధ్వర్యంలో జరిగే ఈ నియమకాలలో తొలి ప్రాధాన్యం రిటైర్డ్ అధ్యాపకులకేనని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోగా సంబంధిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందజేయాలని తెలిపారు. ఈ నెల 16న స్థానిక లంకవీధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు చేపడతామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలల వారీగా ఫ్యాకల్టీ ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల గంట్యాడ, కొత్తవలసలో ఒక్కో ఫ్యాకల్టీ (జంతుశాస్త్రం), డెంకాడ, ఎస్.కోటలో ఒక్కో ఫ్యాకల్టీ (గణితం), ఎస్.కోటలో జనరల్, ఫౌండేషన్ కోర్సు-1, దత్తిరాజేరులో భౌతిక శాస్త్రం -1, సంతకవిటిలో ఇంగ్లీష్-1 ఉన్నాయి.

#### పార్వతీపురం మన్యం జిల్లాలో..

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిషరీస్ (ఒకేషనల్) సబ్జెక్టులో బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రంతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లతో పార్వతీపురం ప్రభుత్వజూనియర్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు ఈ నెల 15న ఉదయం 11 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీవీఈఓ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

## జిల్లాలో 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్'

- 512 కేసులు నమోదు
- రూ.1,13,900 జరిమానా

విజయనగరం క్రైమ్: విద్యాసంస్థల పరిధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరిట చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో సిగరెట్లు, ఖైనీలు వంటి పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ మేరకు ఆదివారం పలు కాలేజీ యాజమాన్యాలను హెచ్చరించారు. గడిచిన ఐదు రోజుల్లో 512 కేసులు నమోదు చేసి, రూ.1,13,900/ జరిమానాను కోప్టా చట్టం కింద విధించామని ఎస్పీ వకుల్ జిందల్ చెప్పారు. గడిచిన ఐదు రోజులుగా జిల్లావ్యాప్తంగా విద్యా సంస్థలకు సమీపంలోని పాన్‌షాపులు, కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయించిన 512మంది వ్యాపారులపై కోప్టాచట్టం (ది సిగరెట్స్ అండ్ అదర్ పొగాకు ప్రొడక్ట్స్ 2003 చట్టం) ప్రకారం కేసులు నమోదు చేసి, వారిపై రూ.1,13,900/ లను జరిమానా విధించామన్నారు. విద్యాలయాలకు దగ్గరలో ఉన్న పాన్ షాపుల్లోను, కిరాణా షాపుల్లో పొగాకు ఉత్పత్తులను విక్రయించడం వల్ల విద్యార్థులు వాటిని వినియోగించేందుకు అలవాటుపడి, వక్రమార్గంలో ప్రయాణించే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పొగాకు ఉత్పత్తులను విక్రయించకుండా చర్యలు చేపట్టేందుకు వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు స్వస్తి పలకాలని ఎస్పీ కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో సంబంధిత సీఐలు, ఎస్ఐలు పాల్గొనగా, డీఎస్పీలు పర్యవేక్షించారు.



ఆపరేషన్ సేఫ్ జోన్ పేరుతో పాన్ షాపుల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

# ఆరోగ్య సిరి

- అన్ని చోట్ల చిరుధాన్యాలకే ప్రాధాన్యం
- కొండల్లో విస్తరిస్తున్న మిల్లెట్స్ సాగు
- పట్టణాల్లో పెరుగుతున్న వినియోగం



కొర్ర పంట వెన్నులు చూపుతున్న గిరిజనుడు



తివ్వాకొండల్లో చిరుధాన్యాల పంట సిరులు



మిల్లెట్స్‌తో తయారు చేసిన ఆహార పదార్థాల



ఆధునిక పరికరాలతో కలుపు నివారణపై శిక్షణ

భామిని: అంతరించి పోతున్న చిరుధాన్యాలను రక్షిస్తూ నేటి తరాలకు పరిచయం చేసేందుకు చిరుధ్యానాల విత్తన సంరక్షణతో పాటు, పంటల సాగు పెరుగుతోంది. సంప్రదాయ పంటలుగా పురాతన కొండ పంటలుగా పిలిచే మిల్లెట్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ సాగు విస్తరణ పెంచుతున్నారు. ఐటీడీఏల పరిధిలో మిల్లెట్స్ సాగు విస్తరణ ప్రణాళిక అమలవుతోంది. ఏపీపీఏ సంస్థ ఆర్థిక సహకారంతో గిరిజనులకు చిరుధాన్యాల విత్తనాలు సేకరించి ఉచితంగా అందిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థ పర్యవేక్షణలో కొండ పంటలు సాగు చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రకృతి సాగు, మిశ్రమ సాగు విధానంలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచుతున్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో మిల్లెట్స్‌పై అవగాహన పెంచుతున్నారు. దీంతో చిరుధాన్యాలైన కొర్రలు, సామలు, గంటెలు, రాగులు, జొన్నలు, ఊదలు, అరిరెకల సాగు పెరుగుతోంది..

#### స్వచ్ఛంద సంస్థల సహకారంతో



సంప్రదాయ పంటల సాగును పునరుద్ధరిస్తున్నాం. ఖరీఫ్‌లో చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యం పెంచాం. పండించిన చిరుధాన్యాలు మిగులు పంటకు మార్కెట్‌లో విలువ వచ్చేలా చర్యలు చేపట్టాం. పట్టణాల్లో పెరుగుతున్న వాడకానికి తగ్గట్లు పండించడానికి గిరిజన ప్రాంతాల్లో సమాయిత్తం చేస్తున్నాం.

కె.రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

#### ఔషధ గుణాల సమ్మిళితం

తృణధాన్యాలు ప్రకృతి ప్రసాదించిన వరాలు. ఔషధ గుణాల సమ్మిళితమైన తిండి గింజలు. ఆరోగ్య గుళికలుగా వీటిని వర్ణిస్తారు. ఇవి తింటూ ఆరు నెలల నుంచి రెండేళ్ల లోపు వ్యాధులను నిర్మూలించుకోవచ్చు. రోగ కారణాలను శరీరం నుంచి తొలగించి దేహాన్ని శుద్ధి చేస్తాయి. తృణధాన్యాలలోని పీచు పదార్థం రక్షణగా నిలుస్తుందని న్యూట్రిస్టులు చెబుతున్నారు. రోజుకు మనిషికి 38 గ్రాముల పీచు పదార్థం అవసరం. చిరుధాన్యాల్లో 25 నుంచి 30 గ్రాముల పీచు పదార్థం లభిస్తుంది. కూరగాయలు, ఆకు కూరల్లో పీచు పదార్థం పొందవచ్చు. కొండపోడు భూముల్లో చేపట్టే చిరుధాన్యాల సాగు పల్లపు ప్రాంతాల భూముల్లోనూ విస్తరిస్తున్నారు. ఆధునిక వ్యవసాయ విధానంలో నాట్లు వేయడం, కలుపు నివారణ, చీడపీడల నివారణకు కషాయాల వైద్యంతో సాగు చేస్తున్నారు. చిరుధాన్యాల పంటలకు తోడు పప్పుధాన్యాలు, కూరగాయల పంటలను మిశ్రమ పంటలుగా పండిస్తున్నారు.

| జిల్లాలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం.. | |
|---|---|
| భామిని | 265 ఎకరాలు |
| సీతంపేట | 266 ఎకరాలు |
| వీరఘట్టం | 176 ఎకరాలు |
| గుమ్మలక్ష్మీపురం | 123 ఎకరాలు |
| కురుపాం | 284 ఎకరాలు |
| పాచిపంట | 196 ఎకరాలు |

## రైలు కింద పడి ఒకరి మృతి

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో మరడాం వద్ద రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వృద్ధుడు దాసరి తవిటయ్య(70) మృతి చెందినట్లు బొబ్బిలి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండల కేంద్రానికి చెందిన తవిటయ్య ఎందుకు ఇక్కడికి వచ్చాడో ఎక్కడికి వెళ్లడానికి పట్టాలు దాటుతున్నాడో తెలియాల్సి ఉందన్నారు. ఈ సంఘటనపై పాచిపెంట గ్రామస్తులకు సమాచారం అందించి మృతదేహాన్ని విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

#### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..



ప్రమాదంలో మృతిచెందిన ధర్మారావు

సాలూరు రూరల్: మండలంలోనిొలిపర్తి సమీపంలో బైపాస్ రోడ్డు పై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సాలూరు పట్టణంలోని గొర్లెవీధికి చెందిన గొర్లె ధర్మారావు (38)ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆదివారం ఉదయం అక్కడికక్కడే మృతిచెందాడు. పొలం పనులకోసం కుమారుడితో కలిసి స్కూటీపై వెళ్తున్న ఆయన ప్రమాదంలో మృతిచెందగా కుమారుడికి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

#### వృద్ధుడి మృతదేహం లభ్యం



నెహ్రూ పార్క్ వద్ద వృద్ధుడి మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నెహ్రూ పార్క్ వద్ద 70 ఏళ్ల వృద్ధుడి మృతదేహాన్ని టూటౌన్ పోలీసులు ఆదివారం గుర్తించారు. తెల్లటి చొకా, తెల్లని గెడ్డం, దుప్పటి, స్టీల్ ప్లేట్ మృతదేహం వద్ద ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భిక్షాటన చేసుకునే వ్యక్తిలా ఉన్నాడని, మృతదేహన్ని గుర్తించిన వారు ఫోన్ 9154874474, టూటౌన్ సీఐ 9121109420 నంబర్లకు ఫోన్ చేయాలని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

#### కంటకాపల్లి రైల్వేస్టేషన్ వద్ద మహిళ మృతదేహం



రైల్వే ట్రాక్ వద్ద గుర్తించిన మహిళ మృతదేహం

విజయనగరం క్రైమ్/జామి: జిల్లాలోని కంటకాపల్లి రైల్వే స్టేషన్‌వద్ద ఓ మహిళ మృతదేహన్ని జీఆర్పీ సిబ్బంది ఆదివారం కనుగొన్నారు. కంటకాపల్లి-అలమండ రైల్వేస్టేషన్ల మధ్య మెయిన్ డౌన్‌లైన్ ట్రాక్ మధ్య పడి ఉన్న మహిళ వయస్సు 35 నుంచి 40 ఏళ్ల లోపు ఉంటుందని ఐదడుగుల ఐదంగుళాల పొడవు, ఎరుపు రంగు ఛాయతో, పసుపు, గ్రీన్, గోధుం రంగు గల నైటీ ధరించి ఉందని ఎవరైనా గుర్తిస్తే ఫోన్ 919490617089, 919182073593, 08912883218 నంబర్లకు సమాచారం ఇవ్వాలని జీఆర్పీ హెచ్‌సీ రవికుమార్ కోరారు.

## ఘనంగా ముగిసిన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ

- విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం
- సీహెచ్ పావని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పావని

విజయనగరం గంటస్తంభం: రెండు రోజుల పాటు జిల్లా కేంద్రంలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఘనంగా ముగిశాయి. రెండవ రోజు సమావేశాలకు ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్ పావని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం గడిచిందని కానీ ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని విమర్శించారు. సంవత్సర కాలం పాటు సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వానికి గడువు ఇచ్చామని ఆ సమస్యలు తీరకపోవడంతో ఈ ప్లీనరీ సమావేశాల స్ఫూర్తితో ఉద్యమాలు రూపొందిస్తామని హెచ్చరించారు. రాబోయే కాలం పోరాటాల కాలమని ఎస్ఎఫ్ఐ నాయకత్వాన విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగించాలని కోరారు. డిగ్రీలో ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి ఆఫ్‌లైన్‌లోనే అడ్మిషన్లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాజాం, గజపతినగరం, విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని కోరారు. 107,108 జీవోలను రద్దు చేసి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్ల అమ్మకాన్ని ఆపాలన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి రాము, సీహెచ్ వెంకటేష్‌లు మాట్లాడుతూ జిల్లాలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్లీనరీ సమావేశాల స్ఫూర్తితో పోరాటం సాగిస్తామని ప్రభుత్వం చొరవ చూపించి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు, ఒ.రవికుమార్, ఎస్.సమీర, ఎం.వెంకీ, పి.రమేష్, కె రమేష్ జిల్లా సహాయ కార్యదర్శులు ఆర్.శిరీష, సోమేష్, ఈ వంశీ, కె.రాజు పాల్గొన్నారు.

## హస్తకళల ఉత్పత్తులకు విశేషస్పందన

- కొనుగోలుకు జనం ఆసక్తి
- విజయనగరంలో 20వ తేదీ వరకు హ్యాండ్‌లూమ్ ఎగ్జిబిషన్



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న ఎగ్జిబిషన్ స్టాల్స్

విజయనగరం అర్బన్: చేనేత వస్త్రాలు, హస్తకళల ఉత్పత్తిదారుల నుంచి నేరుగా వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకు స్థానిక లయన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనల(ఎగ్జిబిషన్)కు విశేష స్పందన లభించింది. వివిధ రాష్ట్రాల నుంచి నేరుగా చేనేత వస్త్రాలను తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుంది. ప్రతిరోజూ ఉదయం 10గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని, భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన హస్తకళలను ప్రోత్సహించాలని కోరారు.



తమిళనాడు 1 గ్రామ్ గోల్డ్ హారాలు, ఆభరణాల స్టాల్

#### ఎగ్జిబిషన్‌లో పలు రాష్ట్రాల ఉత్పత్తులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, గుజరాత్ వంటి రాష్ట్రాల తయారీదారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రదర్శనలో విక్రయిస్తున్నారు. స్వయం ఉపాధి కార్మికులు స్వయంగా తయారు చేసిన హస్తకళలను ప్రోత్సహించాలని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విజయనగరం చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు వచ్చి కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు.

### ఐటీఐలలో రెండవ విడత ప్రవేశాలకు గడువు పొడిగింపు

విజయనగరం అర్బన్:

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో రెండవ విడత ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు ఈ నెల 20 తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ విజయనగరం ప్రిన్సిపాల్ టీవీగిరి తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను 'ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 20వ తేదీ రాత్రి 11.55 గంటల లోపు ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ యూనిక్ నంబర్‌తో ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 1 గంటలోపు సమీపంలోని ప్రభుత్వ/ప్రైవేట్ ఐటీఐలో ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలలో కౌన్సెలింగ్ ఈ నెల 23 నుంచి 25వ తేదీవరకు, ప్రైవేట్ ఐటీఐలో ఈ నెల 26, 27వ తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. లాగిన్ సమయంలో ఎస్ఎస్‌సీ హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా అభ్యర్థి వివరాలు ప్రదర్శితమవుతా యన్నారు. వెంటనే జరేట్ అయిన యూనిక్ నంబర్‌తో కూడిన ప్రింటవుట్‌తో ఏదైనా జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించాలని, వెల్డర్, ప్లంబర్ ట్రేడ్‌లకు 8వ తరగతి, ఇతర ట్రేడ్‌లకు 10వ తరగతి ఉత్తీర్ణత విద్యార్హతగా తీసుకుంటామని చెప్పారు.

ఆధార్‌లో అనుసంధానించిన మొబైల్ నంబర్‌తోనే రిజిస్ట్రేషన్ చేయాలని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 9441518355, 9849944654, 7780658035 నంబర్లలో సంప్రదించాలని కోరారు.